క్లుప్తంగా

7న జాబ్‌మేళా

గద్వాల అర్బన్‌: మనోహరాబాద్‌ ఐటీసీ ఫుడ్‌ ప్రాసెసింగ్‌ ఆధ్వర్యంలో ఈనెల 7న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ ఎస్‌ వీవీ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18–29ఏళ్లు నిండిన మహిళా నిరుద్యోగులు అర్హులని, ఈనెల 7న ఉదయం 10గంటలకు తమ ఒరిజినల్‌ సర్టిఫికెట్లతో జాబ్‌మేళలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9110523925 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు నీటి కష్టాలు



ఉండవెల్లి: మండలంలోని బొంకూరులోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, ప్రైమరీ పాఠశాలకు నీటి ట్యాంకులు ఏర్పాటు చేసిన అక్కడ ట్యాంకుకు ఇప్పటికి కుళాయిలు ఏర్పాటు చేయలేదని విద్యార్థులు తెలిపారు. నీటి ట్యాంకులకు నీరు వస్తే ఇబ్బందులు తొలుగుతాయని పేర్కొన్నారు. మిషన్‌ భగీరథ నీటి కొలాయిలు రెండే ఉండడంతో కరెంట్‌ ఉంటేనే బోరు నీరు వస్తుంది. విద్యార్థులు బాటిళ్లకు నీరు పట్టుకునేందుకు వేచ్చి ఉండాల్సి వస్తోంది. సంపులు ఉన్న కుళాయిలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరగా ట్యాపులు ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు.

మార్చి 31 వరకు గాలికుంటు నివారణ టీకాలు

అలంపూర్‌: ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పశు వైద్య సిబ్బంది గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్య అధికారిణి శిరీష తెలిపారు. అలంపూర్‌, ఉండవెల్లి మండలాల్లోని అన్ని గ్రామాల్లో గాలికుంటు టీకాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లోని రైతులు, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

హామీలను అమలు చేయాలి

గద్వాల అర్బన్‌: కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బహుజన రాజ్యసమితి జిల్లా అధ్యక్షుడు వాల్మీకి డిమాండ్‌ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు విమర్శలు మానుకోని ప్రజలకు మేలు చేయాలన్నారు. ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, రైతు బంధు, ఉద్యోగ నోటిఫికేషన్ల భర్తీ తదితర హామీలను వెంటనే అమలు చేయాలని, లేదంటే బహుజన వర్గాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి వినోద్‌ కుమార్‌, నాయకులు ప్రేమ్‌కుమార్‌, శివరాజ్‌ తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



మానవపాడు: మండల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వ్యక్తులు పోలీసలకు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్‌ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్లను గుర్తించి గురువారం ఎస్‌ఐ చంద్రకాంత్‌ ఆధ్వర్యంతో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా అమరవాయి రాముడు, మానవపాడు శేఖర్‌లకు సెల్‌ ఫోన్లు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఎవరైనా వారి ఫోన్‌ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా ఆ ఫోన్‌ వివరాలను సీఈఐఆర్‌లో నమోదు చేయాలన్నారు. దీని ద్వారా ఫోన్‌ పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని సూచించారు. ఎవరికైనా మొబైల్‌ ఫోన్లు, అనుమానిత వస్తువులు, ఇతర విలువైనా వస్తువులు దొరికితే సమీప పోలీస్‌స్టేషన్లో అప్పగించాలన్నారు. అలాంటి వస్తువులు తమ వద్ద ఉంచుకుంటే నేరం అవుతుందని తెలిపారు.

టీకాలను సద్వినియోగించుకోవాలి

ఎర్రవల్లిచౌరస్తా: పశువులలో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు పాడి రైతులు తప్పనిసరిగా టీకాలను వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్‌ భువనేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు గ్రామాల వారీగా పశు వైద్య సిబ్బంది టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పశువులకు టీకాలు వేయించాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని వల్లూరుకు చెందిన నాగేశ్వర్‌రెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అబ్రహం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఆయా గ్రామాల నాయకులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

హరితహారం అభాసుపాలు

- మొక్కలకు నిప్పు పెట్టి తొలగిస్తున్న రైతులు
- వృథాగా ప్రభుత్వధనం
- పట్టించుకోని అధికారులు



జాతీయ రహదారిపై మంటల్లో కాలిన చెట్లు

ఉండవెల్లి: రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసేలా అడవుల శాతం పెంచేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిన హరితహారం అబాసుపాలవుతోంది. నాటిన మొక్కలకు పంచాయతీ సిబ్బంది ట్యాంకర్‌ ద్వారా నీటిని అందించి కంటికి రెప్పలా కాపాడటంతో అవి ఏపుగా పెరిగాయి. కాని చెట్లుగా మారిన తర్వాత సంరక్షించడంలో అధికారులు విఫలం అవుతుండడంతో అవి కనుమరుగవుతున్నాయి.

యాసిడ్‌, మంటలతో ఎండిపోతున్నాయి.

మండలంలోని కంచుపాడు శివారులో మొక్కలు ఏపుగా పెరిగిన చోట చెట్ల మొదళ్ల వద్ద నరికి వాటి కింద మంటలు పెట్టడం, యాసిడ్‌ పోయడంతో మొక్కలన్నీ ఎండిపోతున్నాయి. జాతీయ రహదారిపై మొక్కలు ఉన్నచోట కాల్చేస్తున్నారు. హరితహారంలో సుమారు 15 వేల మొక్కలు నాటిన వాటిలో 5 శాతం మొక్కలు మంటల్లో కాలిపోవడం, యాసిడ్‌ పోయడం, నరికివేయడం, కరెంట్‌ తీగలకు అడ్డుగా ఉన్నాయని తొలగించడం ఇలా ఎన్నో రకాలుగా మొక్కలను నాశనం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను కొట్టేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లక్ష్యం నీరుగారుతోంది

అలంపూర్‌ నియోజకవర్గంలో హరితహారంలో భాగంగా నర్సరీలను ఏర్పాటు చేసి ప్రకృతిని కాపాడుకునేందుకు మొక్కలు నాటిస్తున్నారు. పలు గ్రామాల్లో కొందరు అధికారులు ప్రణాళికలేమితో రోడ్ల వెంట విద్యుత్‌ తీగల కింద మొక్కలు నాటారు. మొక్కలు కొంచెం పెరగగానే విద్యుత్‌ సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు కొమ్మలను, చెట్లను తొలగిస్తున్నారు. రోడ్ల వెంట, విద్యుత్‌ తీగల కింద మొక్కలు నాటడంతో ఈదురుగాలులకు, వర్షాలకు చెట్లు విరిగి విద్యుత్‌ తీగలపై పడుతున్నాయి.

మొక్కలను కాపాడాలి..

ప్రతి మొక్కను సంరక్షించుకోవాలి. హరితహారంలో మొక్కలను నాటిన అధికారులు మొక్క పెరిగే సమయంలో విద్యుత్‌ అధికారులు అనుమతి తీసుకుని మొక్కలను కొట్టివేయాలి. లేనిపక్షంలో పంచాయతీ కార్యదర్శి జరిమానా విధించాలి. వచ్చే వర్షకాలంలో మొక్కలను ఏపుగా పెంచి నాటించి వాటిని కాపాడుకోవాలి. మొక్కలను కాల్చిన, నరికిన, యాసిడ్‌ వేసిన వారిపై జరిమానా విధించాలి.

– నర్సింగ్‌ రావ్‌, డీఆర్‌డీఓ

పోలియో చుక్కలు తప్పక వేయించాలి



మాట్లాడుతున్న డాక్టర్‌ స్రవంతి

ధరూరు: 0–5 ఏళ్ల లోపు పిల్లలందరికీ పల్స్‌ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ స్రవంతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పల్స్‌ పోలియో చుక్కలు వేసే కార్యక్రమం కొనసాగుతుందని, అందుకు ప్రతి ఒక్కరు గ్రామాల్లో చుక్కలు వేసే కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేయాలని సూచించారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు తమ పిల్లలను తీసుకొచ్చి పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు హీర్యా నాయక్‌, నర్సింహులు, సీహెచ్‌ఓ ఆనందయ్య, పల్లె దవాఖాన సిబ్బంది, పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



అమరవాయిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

మల్దకల్‌: మండలంలోని అమరవాయిలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్‌ పార్టీ మండల నాయకుడు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన రూ.500 రూపాయలకే గ్యాస్‌ సిలిండర్‌, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ వంటి హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకున్న గొప్ప నాయకుడని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు చిన్నతిమ్మన్న, లక్ష్మన్‌, తిప్పన్న, తిమ్మయ్య, ఆంజనేయులు, ఆనందం, భాస్కర్‌ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాలు



ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

అయిజ: పట్టణ సమీపంలోని శ్రీమద్విరాట్‌ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన నాల్గవ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. గురువారం ఆలయంలో వేదపండితులు సుప్రభాత సేవ, స్వస్తీ పారాయణం, ఉత్సవమూర్తుల అభిషేకం చేశారు. గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పూర్ణాహుతి, మహా మంగళహారతి పూజలు చేశారు. రాత్రి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

రైతుల్లో సాగునీటి గుబులు



నీరు అందక ఎండుతున్న వరిపొలంలో పశువులు మేపుతున్న రైతు

- యాసంగిలో తీవ్రమవుతున్న సాగునీటి కొరత
- తగ్గిన భూగర్భజలాలు, ఎండుతున్న బోర్లు
- సాగుకు దూరంగా వరిపంటలు

కేటీదొడ్డి: యాసంగిలో సాగుకు నీటి సమస్య తీవ్రమవుతుండడంతో రైతుల గుండెల్లో గుబులు మొదలవుతోంది. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల్లో నీరు లేకపోవడంతో వరిపంట సాగుకు కష్టంగా మారింది. దీంతో భూగర్భ జలాలు తగ్గి వేసిన బోర్లు ఆగిపోస్తున్నాయి. నెల క్రితం వరినాట్లు వేసుకున్న పొలాలు నీటికొరతతో ఎండుతున్నాయి. ఈ ఏడాది యాసంగి పంట దిగుబడులు గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. వానలు కురవకపోవడం భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలు ఎండి రైతులపై పెట్టుబడుల భారం పడే అవకాశాలున్నాయి.

తగ్గిన వరి సాగు..

గతేడాది యాసంగి సీజన్‌లో కేటీదొడ్డి మండలంలోని 13 వేల ఎకరాలు పైచిలుకు వరిసాగు చేశారు. సాగునీటి కొరతతో ఈ సారి 6 వేల ఎకరాలు మాత్రమే సాగు చేశారు. దిగుబడి గురించి ఆలోచిస్తే ఖర్చులకు కూడా చాలడం లేదని రైతులు పెదవి విరుస్తున్నారు. చాలా వరకు రైతులు వేయాల్సిన దానికంటే తక్కువగా సాగు చేశారు. ర్యాలంపాడు జలాశయం నుంచి వాటర్‌ రాకపోవడంతో చెరువులు కుంటలు ఎండి భగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. దీంతో బోర్లు సరిగ్గా పోయడం లేదు. వేసిన బోర్లు సైతం పోయకపోవడంతో రైతుల్లో యాసంగి సాగు పంటలపై సందిగ్ధం నెలకొంది.


రెండు బోర్లు వేశాం




ఈ సీజన్‌లో రెండు బోర్లు వేశా, అందులో 650 అడుగులపైగా వేసిన నీరు రాలేదు. వేసిన పంట ఎండిపోయే పరిస్థితి ఉంది. గతంలో వేసిన బోర్లు అన్ని ఎండిపోయాయి. చేసేది ఏమీ లేక దేవుడిపై భారం వేశాం. ర్యాలంపాడు కాల్వ ద్వారా నీరు విడుదల చేస్తే తప్ప పంట చేతికొచ్చే పరిస్థితి లేదు.

– తాయప్ప, రైతు, కేటీదొడ్డి

పొలాలు ఎండుతున్నాయి..



ఐదు ఎకరాల్లో వరిసాగు చేశాను. నీరు సరిపోకపోవడంతో ఎండిపోతున్నది. గతేడాది ర్యాలంపాడు కాల్వ ద్వారా నీరు రావడంతో వరి పంట పండించాం. ఈ సారి కాల్వ ద్వారా నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. ఈ సారి పెట్టుబడి కూడా వస్తుందా? రాదా? అనే సందేహంలో ఉన్నాం. – వీరన్న, రైతు, కేటీదొడ్డి



ఓ వైపు పచ్చగా ఉన్న వరిపంట

రైతుబీమా చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని రాజశ్రీ గార్లపాడుకు చెందిన రైతు చాంద్‌ అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. గురువారం అలంపూర్‌ ఎమ్మెల్యే విజయుడు ఆర్‌ గార్లపాడుకు చేరుకొని బాధిత కుటుంబానికి రైతుబీమా రూ.5లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌రెడ్డి, భాస్కర్‌, పెద్ద భీమన్న, గ్రామ పెద్దలు ఉన్నారు.

నియంత పాలనను గద్దెదించుదాం




గద్వాల అర్బన్‌: ప్రజల హక్కులను కాలరాస్తూ నియంత పాలన కొనసాగిస్తున్నారని, కార్పొరేట్‌ శక్తులకు దేశాన్ని అమ్మేస్తున్నారని సీపీఐ ఎంఎల్‌ మాస్‌ లైన్‌ ప్రజాపంథా డివిజన్‌ నాయకులు చింత రేవుల కృష్ణ, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జమ్మిచేడు కార్తీక్‌ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 3, 4, 5వ తేదీల్లో ఖమ్మంలో మూడు విప్లవ పార్టీల ఐక్యత మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభలకు ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌ రాజ్‌, అంజి, చంద్రాములు, జమ్మన్న, జయన్న, తిమ్మప్ప తదితరులు ఉన్నారు.

ఈత వనాలకు రక్షణ కల్పించాలి

రాజోళి: ఈత చెట్లకు రక్షణ కల్పించాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు జయన్న గౌడ్‌, ఉపాధ్యక్షులు వెంకట్రామగౌడ్‌, ప్రధాన కార్యదర్శి సిద్దయ్య గౌడ్‌ గురువారం ఒక ప్రకటనలో కోరారు. వేసవి కాలం కావడంతో గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభమవుతాయని, ఈ క్రమంలో స్థానికంగా ఉండే కొందరు తమ స్వార్థం కోసం ఉపాధి పనుల పేరుతో ఈత చెట్లను నరికేసి, వ్యవసాయ భూమిగా మార్చేందుకు ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో చాలా గ్రామాల్లో ఇదే జరిగిందని అయినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రతి వేసవిలో వందలాది ఈత చెట్లు తొలగిస్తున్నారని తెలిపారు. అధికారులు అలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించాలి



శాంతినగర్‌: పదో తరగతిలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ నరసింహ అన్నారు. వడ్డేపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలను ఎంఈఓ గురువారం సందర్శించారు. త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు అందరూ సన్నద్ధం కావాలన్నారు. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయుల సలహాలు పాటిస్తూ విద్యార్థులు కృషిచేయాలన్నారు. వడ్డేపల్లి మండలంలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులందరు ఉత్తీర్ణత సాధించి అటు తల్లిదండ్రులకు, ఇటు మండలానికి మంచి పేరు తెచ్చిపెట్టాలని కోరారు. ఎంఈఓ వెంట ఉపాధ్యాయులు భాస్కర్‌, ఊశన్న, వినోద్‌, నాగరాజు, రాజశేఖరాచారి, వెంకటరమణ ఉన్నారు.

అధికమవుతున్న నీటి సమస్య

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు



ఉండవెల్లి ఎంపీడీఓ కార్యాయలంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ



సమస్యలను తెలుపుతున్న వైస్‌ ఎంపీపీ దేవన్న

ఉండవెల్లి: ప్రతి గ్రామంలో నీటి సమస్యలు అధికమవుతున్న తరుణంలో అన్ని గ్రామాలకు మిషన్‌ భగీరథ నీరు అందించాలని ఎంపీటీసీలు అధికారులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ బీసమ్మ, ఎంపీడీఓ జబ్బార్‌ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీలు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరై సమస్యలను తెలిపారు. వ్యవసాయ అధికారి సురేఖ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరికి రైతుబంధు, పీఎం కిసాన్‌ డబ్బులు అందుతాయని తెలిపారు. పప్పుశనగ తక్కువ దిగుబడి కావడంతో పొగాకు అధికంగా రైతులు సాగు చేశారని తెలిపారు. 7వేల మంది రైతులకు రైతుబంధు పడిందని, మిగితా వారికి కూడా రైతుబంధు పడుతుందన్నారు విద్యుత్‌ అధికారి శివకుమార్‌ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కొత్త విద్యుత్‌ స్తంభాలను ఏర్పాటు చేశామన్నారు. మారమునగాల, ఉండవెల్లి, బైరాపురం గ్రామాల్లో విద్యుత్‌ స్తంభాలను ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు అడగడంతో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. నీటి సాంద్రత తగ్గిపోవడంతో నీటిని వృథా కాకుండా ఉపయోగించుకోవాలని, లేదంటే పంట పొలాల్లో బోర్లను వాడకంలోకి తీసుకుని రావచ్చని తెలిపారు. వైద్యాధికారులు మాట్లాడుతుండగా ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్‌ పరీక్షలు నిర్వహించి సరైన సమయంలో మందులు అందిస్తున్నామని తెలిపారు. కుక్కలు అధికమవడంతో రాబీస్‌ వ్యాధిపై శ్రద్ధ వహించి టీకాలు అందించాలని సూచించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ పథకంపై మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 100 రోజుల కూలీలు సమయ పాలన పాటించేలా చూడాలన్నారు. త్వరలో హాజరు శాతాన్ని పరిశీలించి తెలపాలని పేర్కొన్నారు. జాతీయ రహదారి నుంచి ఉండవెల్లికి వచ్చే మార్గంలో బ్రిడ్జికు మరమ్మతులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ సలీమొద్దీన్‌, వైస్‌ ఎంపీపీ దేవన్న, మండల కో ఆప్షన్‌ మెంబర్‌ చిన్న బాస్‌ మియ్యా, ఎంపీటీసీలు సుంకన్న, కురుమూర్తి, హారిక, భరతసింహారెడ్డి పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన నోడల్‌ అధికారి



ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న నోడల్‌ అధికారి హృదయరాజు

అయిజ: మండల కేంద్రంలో ఇంటర్‌ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మండలం కేంద్రంలో ప్రభుత్వ జూనియర్‌ కలాశాల, హరిహర, హరోరా కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. గురువారం నిర్వహించిన తెలుగు పేపర్‌ 2 పరీక్షలకు 742 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 22 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను నోడల్‌ అధికారి హృదయరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిబంధనల మేరకు పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వారికి పలు సలహాలు, సూచనలు చేశారు.

గట్టు పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్‌ తనిఖీ

గట్టు: మండల కేంద్రమైన గట్టు ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఇంటర్మీడియట్‌ పరీక్ష కేంద్రాన్ని గురువారం తహసీల్దార్‌ సరితరాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విద్యార్థులు మాస్‌ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మొత్తం 323 మంది విద్యార్థులకు 321 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్‌ సూపరిండెంట్‌, డిపార్ట్‌మెంటల్‌ అధికారి తెలిపారు.

తిక్క వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎస్‌ఐ విజయ భాస్కర్‌



ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

అయిజ: పట్టణంలోని తిక్క వీరేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా భక్తులు బుధవారం రాత్రి ప్రభోత్సవం నిర్వహించారు. చిన్న రథంపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ప్రభోత్సవం కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అదేవిధంగా గురువారం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్‌ఐ విజయభాస్కర్‌ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్ధరాత్రి స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు.



విద్యుత్‌ దీపాలతో అలరారుతున్న అలంపూర్‌ ఆలయాలు

లైటింగ్‌ షో ట్రయల్‌రన్‌

జోగులాంబ శక్తిపీఠం: మహాశివరాత్రి సందర్భంగా అలంపూర్‌ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో లైటింగ్‌ డెకరేషన్‌కు ట్రయల్‌ రన్‌ నిర్వహించారు. మార్చి 4వ తేదీ నుంచి మహాశివరాత్రి వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో లైటింగ్‌ షో ట్రయల్‌ రన్‌ నిర్వహించారు. విద్యుత్‌ దీపాల వెలుగులతో ఆలయాలు దేదీప్యమానంగా వెలుగొందాయి.

ప్రయాణం ప్రమాదకరం



కూలీలను తీసుకెళ్తున్న బొలెరో

మల్దకల్‌: గూడ్స్‌వాహనాలలో ప్రయాణికులను చేరవేస్తూ ప్రజల ప్రాణాలతో ప్రైవేట్‌ వాహనదారులు ప్రమాదాలకు గురిచేస్తున్నారు. ప్రతిని త్యం కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి మల్దకల్‌ మండలంలోని వివిధ గ్రామాలకు కూలీలను తీసుకొస్తున్నారు. ఒక్కొక్క వాహనంలో దాదాపు 20నుంచి 40మందికి పైగా కూలీలను చేరవేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేటు వాహనదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మతసామరస్యానికి ప్రతీక రాజావళి ఉర్సు



రంగులతో ముస్తాబైన రాజవళి దర్గా

అమరచింత: పట్టణంలో వెలసిన రాజవళి దర్గా ఉర్సు మార్చి 1 నుంచి 3 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. 1న గంధోత్సవం, 2న తాజేచిరాక్‌, 3న ఖత్మేఖురాన్‌ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉర్సు సందర్భంగా చాదర్‌ ఊరేగింపుతో పాటు ఆల్‌ఇండియా కృష్ణ, మహేష్‌బాబు అసోసియేషన్‌ జాతీయ అధ్యక్షుడు ఖాదర్‌ గోరి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

మదనాపురం: మండలంలోని కొన్నూరు పెద్దతండాలో శ్రీ రామలింగేశ్వర ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం హోమం, యంత్ర ప్రతిష్ఠ, గోపుర కలశ స్థాపన, రామలింగేశ్వర ఆంజనేయ విగ్రహాలు, నవగ్రహాలు, ధ్వజ శిల, నాభి శిల స్థాపన చేశారు.